

సెల్ఫీతో ఆనందం

విశాఖ విద్య: పశ్చిమ నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ బుధవారం బుచ్చిరాజుపాలెంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు వచ్చారు. వేడుకలో పాల్గొని తిరిగి వెళుతున్న సమయంలో ఓ బాలిక ఆనంద్ కుమార్ దగ్గరకు వచ్చి సెల్ఫీ కావాలని కోరింది. ఆనంద్ కుమార్ సరే అనడటంతో ఆ బాలిక సెల్ఫీ తీసుకొని ఎంతో ఆనందం వ్యక్తం చేసింది.

ప్రత్యర్థుల కలయిక

విశాఖ విద్య: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ, కూటమి నుంచి బరిలో ఉన్న ఆడారి ఆనంద్ కుమార్, గణబాబు ఇద్దరూ ఎదురుపడ్డారు. బుచ్చిరాజుపాలెం చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి ఆడారి ఆనంద్ కుమార్ మొదటిగా వచ్చారు. ఇదే సమయంలో గణబాబు కూడా లోపలికి రావడంతో ఇరువురుకి ఒకేసారి అర్చకుడు పూజలు నిర్వహించి, హారతి అందజేశారు. ప్రత్యర్థులిద్దరూ ఇలా కలుసుకోవడం అంతా ఆసక్తిగా గమనించారు.



కరెన్సీతో అలంకరణ

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రశాంతినగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుని జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాబాను సాయిబాబాను కరెన్సీతో విశేషంగా అలంకరించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ , బెహరా భాస్కరరావు, గుణిశెట్టి శ్రీనివారావు, అప్పలస్వామి నాయుడు, పేడాడ రమణి కుమారి బాబాను దర్శించుకున్నారు.



క్లుప్తంగా

సాయిమందిరంలో ఆనంద్ కుమార్ పూజలు



సాయిబాబా వారిని దర్శించుకున్న ఆడారి ఆనంద్ కుమార్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలోని శ్రీషిర్డీ సాయి ధ్యానమందిరాన్ని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆడారి ఆనంద్ కుమార్‌ను ఆశీర్వదించారు. పట్టు వస్త్రాలతో ఆయనను సత్కరించారు. వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు నమ్మి శ్రీను, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న కాపు కల్యాణ మండపం



పద్మనాభనగర్‌లో చివరి దశకు చేరుకున్న కాపు కల్యాణ మండపం

గోపాలపట్నం: జీవీఎంసి 92వ వార్డు పద్మనాభనగర్‌లో కాపు కల్యాణ మండపం చురుగ్గా సాగుతోంది. ఈ నిర్మాణం మూడు నెలల క్రితం జీవీఎంసీ నిధులతో సుమారు రూ.2 కోట్లతో కాపు కల్యాణ మండపాన్ని వైఎస్సార్‌సీపీ పశ్చిమ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చాలా మేరకు ప్లాస్టింగ్‌లు పూర్తి చేయగా, ఫ్లోరింగ్ వంటి పనులు చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే గోపాలపట్నం ప్రాంత కాపులకు ఒక వేదిక సమకూరినట్లవుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు 58వ వార్డులో డోర్ టూ డోర్ ప్రచారం

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు ఉప్పర కాలనీ పరిధిలో గురువారం డోర్ టూ డోర్ ప్రచార కార్యక్రమం జరగనుంది. వార్డు కార్పొరేటర్ గులిగిండల లావణ్య ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రచార కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమన ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొంటారు. పలువురు ఓటర్లను నేరుగా కలిసి ఓట్లను అభ్యర్థించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ప్రచార కార్యక్రమం జరగనుంది.

నేడు ట్రేడ్ యూనియన్ ఆత్మీయ సమావేశం

జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెం పరిధి వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం సాయంత్రం 5 గంటలకు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆత్మీయ సమావేశం జరగనుంది. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయపరెడ్డి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అతిథిగా పాల్గొని కార్మికులనుద్దేశించి ప్రసంగిస్తారు.

కమనీయం.. జగదభిరాముని కల్యాణం

నియోజకవర్గంలో సీతారామ కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రామ నామ స్మరణతో ఆయా ఆలయాలు హోరెత్తాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి సీతారాముల ఆలయాలను అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సీతారాముల జగత్కల్యాణాన్ని కనులారా వీక్షించి భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

- రామాలయాలకు పోటెత్తిన భక్తులు
- జగత్కల్యాణాన్ని కనులారా వీక్షించిన వైనం
- రామనామంతో హోరెత్తిన ఆలయాలు



శ్రీషిర్డీ సాయి మందిరంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



40వ వార్డులో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

గోపాలపట్నం: శ్రీరామనవమి సందర్భంగా గోపాలపట్నంలోని పలు రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఉన్న రామాలయంలో ఉదయం నుంచి భారీగా భక్తులు హాజరయ్యారు. బాజి జంక్షన్ కోదండ రామాలయంలో రాములోరి కల్యాణం వైభవంగా జరిగింది. పద్మనాభనగర్, ఇందిరానగర్, కంపరపాలెం రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో కల్యాణం అనంతరం అన్నదానాలు నిర్వహించారు.

రామాలయంలో ఆడారి పూజలు

గోపాలపట్నం, పద్మనాభనగర్, బాజీజంక్షన్, కంపరపాలెం ఇందిరానగర్ ప్రాంతాల్లోని రామాలయాల్లో వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనను ఆశీర్వదించారు. ఆయనతో పాటు జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, ఎన్నికల పరిశీలకురాలు పేడాడ రమణి కుమారి పాల్గొన్నారు. 89వ వార్డు కొత్తపాలెం గవర, కాపు సామాజిక వర్గాల నిర్వహణలో ఉన్న రామాలయాల్లో, చంద్రనగర్ రామాలయంలో ఆడారి ఆనంద్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి గోపాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్, మళ్ల శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ అయితంశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పద్మనాభనగర్ రామాలయం వద్ద సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఆడారి ఆనంద్ కుమార్

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం శ్రీపార్వతీ చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంపై పురోహితులు రమేష్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా శ్రీసీతారాముల కల్యాణ జరిపించారు. ఆలయ అధ్యక్షుడు నాగేంద్ర, కార్యదర్శి ఎం. శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షుడు రవిశంకర్, కోశాధికారి సూర్యనారాయణ, సభ్యులు కేఎస్ఎన్ రాజు, అజయ్, భరత్ కుమార్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఏపీఎస్ఈబీ శ్రీ షిర్డీ సాయి ధ్యానమందిరంలో భక్తసందోహం నడుమ సీతారాముల కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణరావు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. విమాన్‌నగర్‌లో కాలనీ అసోసియేషన్ కార్యదర్శి నాగు ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

52వ వార్డులో:- కరాస, శాంతినగర్, అంబేడ్కర్ నగర్ ఆలయాల్లో శ్రీసీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.కృష్ణ (అల్లా కృష్ణ), వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి మాలతి వేడుకల్లో పాల్గొని, శ్రీసీతారాముల వారికి పూజలు నిర్వహించారు. 57వ వార్డు దుర్గాపురంలో కాలనీ వాసులంతా ఐక్యతతో సీతారాముల కల్యాణం జరిపించారు.



కొత్తపాలెం రామాలయంలో కల్యాణంలో పాల్గొన్న ఆడారి ఆనంద్ కుమార్

ప్రజలంతా బాగుండాలి:- ఆడారి ఆనంద్ కుమార్ లోకానికి ఆదర్శప్రాయుడైన శ్రీసీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. 90వ వార్డు పరిధిలోని చంద్రమౌళీశ్వరస్వామి, శ్రీషిర్డీసాయి ధ్యానమందిరంలో జరిగిన శ్రీసీతారాముల కల్యాణ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజానీకమంతా సుఖసంతోషాలతో ఉండాలని సీతారాముల వారిని ప్రార్థించానన్నారు. వార్డు నాయకుడు నమ్మి శ్రీను, చుక్కా ప్రసాదరెడ్డి, సీతారామరాజు కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు పాల్గొన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే గణబాబు, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

ప్రతీ నోటా జై శ్రీరామ్ నాదం

మల్కాపురం : శ్రీరామనవమి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డులలో బుధవారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం , రామాలయం వద్ద వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, వార్డు కార్పొరేటర్ గులిగిండల లావణ్య, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు మళ్ల ధనలత, తోనంగి వెంకటరమణి, వేమన సంక్షేమ సంఘం ప్రతినిధులు, పిలకవానిపాలెం గ్రామ పెద్దలు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా సీతారాములకు పిల్లా రమాకుమారి పట్టు వస్త్రాలు సమర్పించారు. 59వ వార్డు నక్కవానిపాలెంలో, 60వ వార్డు ఇందిరాకాలనీలో, 61వ వార్డు మల్కాపురం, ప్రకాష్‌నగర్లో, 62వ వార్డు త్రినాథపురంలో, 40వ వార్డు ఏకేసీకాలనీ వద్ద జరిగిన కల్యాణ వేడుకలలో పిల్లా రమాకుమారి, ఆయా వార్డుల కార్పొరేటర్లు గులిగిండల లావణ్య, పుర్రె పూర్ణశ్రీయాదవ్, పీవీ సురేష్, కొణతాల సుధ, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు తదితరులు పూజల్లో పాల్గొన్నారు. 61వ వార్డు మల్కాపురం నగరాలవీధి వద్ద జరిగిన సీతారాముల కల్యాణంలో వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం దంపతులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. నక్కవానిపాలెం వద్ద జరిగిన కళ్యాణంలో వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్, ఇండ్రస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, 60వ వార్డు జవహర్‌నగర్ వద్ద కణ వేడుకల్లో వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో...

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో సీతారాములు కల్యాణ మహోత్సవాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్నసమారాధన నిర్వహించారు.

షిప్‌యార్డ్‌కాలనీలో..

షిప్‌యార్డ్‌కాలనీలోని పురాతన ఉమారామలింగేశ్వర ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు శ్రీనివాస్‌శర్మ సమక్షంలో సీతారాముల కల్యాణమహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. హిందూస్తాన్ షిప్‌యార్డ్ వెల్డింగ్ డిపార్టెమెంట్‌లో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంస్థ విరామ సమయంలో కార్మికులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి షిప్‌యార్డ్ అధికారులు ఎస్.అశోక్‌కుమార్, సింహాచలందాస్, ఎంవీబీఎస్ గుప్తా, డి.శ్రీనివాస్, జి.దిలిప్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీరామనవమి కమిటీ చైర్మన్ డి.వి.రమణ నాయకత్వంలో బి.రాము, ఓస్.మణికంఠరావు, ఏబీవీ శ్రీనివాస్, వై.శ్రీనివాస్, నానాజీ, వై.గోవింద్, గుర్తింపు యూనియన్ నాయకులు, కార్మికులు, ఎల్అండ్ఎం సిరిస్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో....

జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయంలోనూ, ప్రకాష్‌నగర్ శ్రీశివరామకృష్ణ ఆలయంలోనూ, దుర్గానగర్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆయలంలోనూ శ్రీ సీతారాముల కల్యాణమహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి యలమంచిలి మున్సిపల్ చైర్పర్సన్ పిల్లా రమాకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని సీతారాముల ఉత్సవ మూర్తులకు దగ్గరుంచి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.



పిలకవానిపాలెంలో జరిగిన రాములోరి కల్యాణానికి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న రమాకుమారి



ఏపీఎస్ఈబీ కాలనీలో భక్తులకు అన్నదానం



శ్రీషిర్డీ సాయి మందిరంలో నిర్వహించిన వేడుకలో పాల్గొన్న భక్తులు



52వ వార్డులో జరిగిన వేడుకలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, ఆనంద్ కుమార్ సతీమణి మాలతి



చంద్రమౌళీశ్వర ఆలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మహిళలు



యల్లపువానిపాలెం రామాలయంలో కల్యాణంలో పాల్గొన్నభక్తులు



సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



నక్కవానిపాలెంలో జరిగిన కళ్యాణ వేడుకల్లో కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్, పుర్రె సురేష్‌యాదవ్



59వ వార్డులో శ్రీరామనవమి పూజల్లో పాల్గొన్న పిల్లా రమాకుమారి



మల్కాపురంలో కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భోగవల్లి నాగభూషణం దంపతులు



62వ వార్డులో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని జరిపిస్తున్న రమాకుమారి

ఘనంగా ముత్యమాంబ తొలేళ్ల సంబరం



తొలేళ్ల సంబరంలో అమ్మవారి ఘటాల ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం పరిధి గవర కంచరపాలెం ముత్యమాంబ అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు గ్రామాభ్యుదయ సంఘం అధ్యక్ష-కార్యదర్శులు దాడి సూర్య అప్పారావు, మళ్ల శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గురువారం తెల్లవారు జాము నుంచి అమ్మవారి ప్రత్యేక దర్శనాలతో ప్రధాన జాతర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి నగర ప్రాంతాల మీదుగా అమ్మవారి ఉత్సవ ప్రతిమల ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. భక్తులు తలపై అమ్మవారి ప్రతిమలను జగదాంబ కూడలి, అల్లిపురం, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులుపేట ప్రాంతాల మీదుగా కంచరపాలెం పుట్టబంగారం అమ్మవారి మూలవిరాట్ వద్దకు చేర్చారు. ఉత్సవంలో పలువురు ప్రముఖులు అమ్మవారి ఘటాలను తలపై ఉంచి మొక్కులు తీర్చుకున్నారు. పాలకవర్గ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు, పొలమరశెట్టి ఉమారమేష్, శరకం శ్రీనివాసరావు, దాడి వెంకటరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రత్యేకతల పండగ...

దశాబ్దాల నుంచి అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం నాటి ఊరేగింపులో ఒడిశాకు చెందిన బ్యాండు సింగారి మేళ, తప్పెటగుళ్ల, విజయనగరం పులివేషాలు, వివిధ జంతువుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి కీర్తనలు, ఆలపిస్తూ ధూప, దీప నైవేద్యాలు, సమర్పిస్తూ, హారతులతొ భక్తులు ముందుకు సాగారు.

నేడు ప్రధాన జాతర....

కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో వెలసిన ముత్యమాంబ ఆలయంలో గురువారం జరిగే ప్రధాన జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయాన్ని సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, శీతలపానీయాలు అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. భక్తులు ప్రధాన జాతరకు రావాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

లా అండ్ ఆర్డర్‌కు నూతన వాహనం



పోలీస్ స్టేషన్‌లో పోలీస్ ద్విచక్రవాహనం

గోపాలపట్నం: లా అండ్ ఆర్డర్ పోలీసులకు నూతన ద్విచక్రవాహనాల సమకూరాయి. ఈ వాహనంలో సైరన్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, సిగ్నల్ లైట్‌తో పాటు ఎల్ఈడీ స్క్రీన్‌తోపాటు కెమెరా వంటి సౌకర్యాలు కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వాహనాలను గుర్తించి ఫొటో తీస్తోంది.

కార్మికుల పోరాటం స్ఫూర్తిదాయకం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఇంతటి సుదీర్ఘ పోరాటం చేస్తున్న ఘనత 'ఉక్కు' కార్మికులకే చెందుతుందన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1161వ రోజు, బుధవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. విశాఖ ఉక్కు దీక్షను స్ఫూర్తిగా తీసుకుని దేశవ్యాప్తంగా కార్మికవర్గం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్లాంట్‌లో ఉన్న విభాగాలను పునఃప్రారంభించి ఉత్పత్తిని పెంచాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరం వద్ద ఐక్యంగా నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

పక్షులకు అందుబాటులో తాగునీరు



ఎకో వైజాగ్ ప్లకార్డులు, మట్టి ప్రమిదలతో విశాఖ మరియా మేక్స్ సంస్థ మహిళలు

ఆరిలోవ: వేసవికి విలవిల్లాడుతున్న పక్షులు, పశువులకు తాగునీటిని అందించడానికి విశాఖ మరియా మేక్స్, గ్రీన్ క్లైమేట్ బృందం ఆధ్వర్యంలో బుధవారం ఆరిలోవలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చెట్లు, మొక్కల నీడలో వెడల్పయిన మట్టి పాత్రలు ఏర్పాటు చేసి వాటిలో నీరు పోశారు. ఆ నీటిని పక్షులు, పశువుల తాగడానికి వీలుగా ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశాఖ మరియా మేక్స్ సిస్టర్ సెల్వీ మాట్లాడుతూ తీవ్ర ఎండలు ఉన్న నేపథ్యంలో పక్షులు, పశువులకు దాహం తీర్చడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల సభ్యులు రాజేశ్వరి, డి.వి.లక్ష్మి, సీహెచ్.అక్కమ్మ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.